క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు



లింగాల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పద్మన్నపల్లికి చెందిన ఓ రైతు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం ఎస్‌ఐ, పోలీసులు రైతు పొలంలో ఉన్న మద్యం సీసాలను పరిశీలించారు. అనంతరం పొలాల్లో మద్యం తాగొద్దని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ వెంకటేష్, పోలీసు సిబ్బంది, రైతులు, యువకులు పాల్గొన్నారు.

లట్టుపల్లిని మండలంగా ప్రకటించాలి



బిజినేపల్లి: దశాబ్దకాలంగా లట్టుపల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్థానిక రైతువేదికలో లట్టుపల్లితో పాటు ఎర్రకుంటతండా, ఉడుగుల కుంటతండా, నక్కల చెర్వు, చిన్నపీరు, మిట్యా, తండాలకు చెందిన నాయకులు సమావేశమై చర్చించారు. అనంతరం ఆయా గ్రామాల నాయకులు, తండావాసులు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని అధికారులకు సమస్యను వివరించారు. ప్రజల అభిప్రాయాలను సేకరించి అందరికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డీఈఓకు వినతి



బిజినేపల్లి: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా వసతులను మెరుగు పర్చాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పల్లె అభిషేక్ రెడ్డి బుధవారం డీఈఓ రమేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వీపర్, స్కావెంజర్ పోస్టుల కోసం స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ కోరారు. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు ఆసక్తి ఉన్న మహిళా సంఘాల గ్రూపు సభ్యులు ఈ నెల 18వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న పురుషులు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

పాఠశాలలకు యూనిఫాం అందజేత

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం బాలస్వామి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న రెండు జతల యూనిఫామ్‌లను మండల మహిళా సమాఖ్య అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పాఠశాలలు రీ ఓపెన్ చేస్తున్నందున పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ సత్యనారాయణశెట్టి తెలిపారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల: ప్రభుత్వం మండల మహిళా సమాఖ్య మహిళలతో కుట్టించిన ఏకరూప దుస్తులను బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ చంద్రశేఖర్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. మండలంలోని 33 పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు సంబంధించిన 1728 ఏకరూప దుస్తులను మొదటి విడతలో పంపిణీ చేశారు.

అంగన్‌వాడీలో చేర్పించాలి



తెలకపల్లిలో ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



కొల్లాపూర్ ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది

తెలకపల్లి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 3వ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో పాటు పౌష్టికాహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌చ చంద్రకళ, హెల్పర్ లక్ష్మమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అమ్మ మాట– అంగన్‌వాడీ బాట

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీకృష్ణనగర్ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని వారి తల్లిదండ్రులను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వాతి కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీశైలమ్మ, సఫియా తదితరులు ఉన్నారు.

బల్మూరులో..

బల్మూర్: మండల కేంద్రంలో నిర్వహించిన అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో సీడీపీఓ దమయంతి హాజరయ్యారు. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు గ్రాడియేషన్ డే నిర్వహించి వారికి సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ విష్ణుమూర్తి, సూపర్‌వైజర్ నిర్మల, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ పార్వతి, గర్భిణులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కేంద్రాలలో కొత్తగా చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అదే విధంగా బడిబాట ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలను మామిడి తోరణాలు, ఆకర్షణీయమైన బొమ్మలతో అలంకరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, శాంతమ్మ, అంజలి, ఆయాలు మంజుల, సూరమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెల్దండలో..

వెల్దండ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాసమ్మ, ఆయాలు ఉన్నారు.

‘సాక్షి’పై దాడులు అప్రజాస్వామికం



అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

అచ్చంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై కూటమి మూకలు విధ్వంసానికి పాల్పడ్డటం, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసురావును ఏపీ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించడం అప్రజాస్వామికమని పలువురు జర్నలిస్టులు అన్నారు. బుధవారం అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో ఏపీలో సాక్షి కార్యాలయాలపై జరుగుతున్న దాడులు, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావు అక్రమ అరెస్టు నిరసిస్తూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మీడియా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు అక్కడి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వాపోయారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో మీడియాపై జరుగుతున్న దాడులను అందరు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బండారు శ్రీనివాస్, ఎండీ రవూఫ్, కాలూరి శ్రీను, సేవకులు శేఖర్, లక్ష్మపతి, బాలింగం, రవి, మురళి, నరేందర్, నారాయణ, అంజనేయులు, సుధాకర్, చందు, జహంగీర్, ప్రభాకర్, రవీందర్‌గౌడు, రవి, శ్రీనివాసులు, సజానందం, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



చారకొండ మండలం జూపల్లిలో విత్తనాలను లేబుల్‌ను పరిశీలిస్తున్న ఏఓ తనూజరాజ్

చారకొండ: మండలంలోని జూపల్లిలో బుధవారం ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ తనూజరాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పత్తి విత్తన సీడ్స్, మందులను పరిశీలించారు. సీడ్స్ లేబుల్‌తో పాటు వాటి కంపెనీ లాట్ నంబర్‌ను పరిశీలించారు. నిర్ణీత ధరలకు సంబంధిత బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనగోలు చేసిన మందులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ఏఈఓ సుష్మ, డీలర్లు బిక్షపతి యాదవ్, కార్తీక్ యాదవ్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి

బల్మూర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని కోరతూ సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ ఆధర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసాలకు పాల్పడుతున్న డీలర్లపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ లాల్‌అహ్మద్, మహేందర్, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

కొల్లాపూర్: నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించొద్దని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ సూచించారు. బుధవారం ఆయన కొల్లాపూర్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి బాలపీరు, నాయకులు ఎల్లగౌడ్, తారాసింగ్, శ్రీనివాసులు, రాములు, చిట్టెమ్మ, దేవమ్మ, చంద్రయ్య, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



కల్వకుర్తి తోటపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు అల్లాపూర్‌లో బుధవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందన్నారు. ఉచిత పుస్తకాలతో పాటు దుస్తులు, భోజనం ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఆయా గ్రామాలలో బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలను వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

ఉప్పునుంతల: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మండలంలోని పెద్దాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించి డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్యాసుందర్‌గౌడ్, అజ్మతుల్లా, రాజవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



నాగర్‌కర్నూల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: రైతుభరోసా, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పొదిల రామయ్య మాజీ ఎంపీటీసీ యాదయ్య, మధు, వెంకటేష్, శివారం, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ. 2 లక్షలు రుణ మాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం సర్వేయర్ షఫీఉల్లాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు, నాయకులు హుస్సేన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: రైతుల, ప్రజా సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తోందని సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ ఆరోపించారు. బుధవారం దీనికి నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయసింహకు వినతిపత్రం ఇచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. తిమ్మస్వామి, ఆదిలక్ష్మి, కృష్ణయ్య, లక్ష్మమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

లింగాల: కేంద్రం ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ జెడ్పీటీసీ, రైల్వే బోర్డు సభ్యుడు ధర్మానాయక్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు గువ్వని నవీన్ అధ్యక్షతన బీజేపీ మండల కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. 11 ఏళ్లలో కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, సైదులు, బీజేవైఎం నాయకులు సాయిసాగర్, నాయకులు సలేశ్వరం, సోషల్ మీడియా కన్వీనర్ శివ శంకర్, విష్ణు, మహేశ్వరం, హేమంత్, వెంకటయ్య, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలోని కాంసానిపల్లి ఫీడర్‌లో తరుచూగా సాంకేతిక సమస్యలు రావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఉప్పునుంతల సబ్‌స్టేషన్ నుంచి కాంసానిపల్లి ఫీడర్ ద్వారా గట్టుకాడిపల్లి, కాంసానిపల్లి, తిర్మలాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. తరచుగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తూ కోతలు విధిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బిజినేపల్లిలోనే వెల్గొండను కొనసాగించాలి

బిజినేపల్లి: మంగనూర్ గ్రామాన్ని నూతన మండలం ఏర్పాటు కోసం ఇటీవల కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా వెల్గొండ గ్రామాన్ని బిజినేపల్లి మండలంలోనే కొనసాగించాలని బుధవారం ఎంపీడీఓ కథలప్పగౌడు సమక్షంలో గ్రామస్తులు తీర్మానించారు. వెల్గొండ గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు, యువజన సంఘాలు, ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. తీర్మానం అనంతరం గ్రామస్తులు సంతకాలు చేశారు. నాయకులు ఈర్ల చంద్రమౌళి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లయ్య, వేమన, రామలక్ష్మణ్, అనిల్, సురేందర్, బ్రహ్మచారి, నసీర్, వెల్గొండ గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చారకొండ: సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడిఓకు వినతి పత్రం సమర్పించారు. 18 నెలలుగా సమస్యలు పరిష్కరించడం లేదని వాపోయారు. ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను క్లియర్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీ నిర్వహణ భారంగా మారిందని దీంతో ట్రాక్టర్ కీ లను అప్పగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గణేష్, రవిశంకర్, సురేందర్ రెడ్డి, వినోద్, మల్లేష్ , తదితరులు ఉన్నారు.

సారా స్థావరాలపై దాడులు

చారకొండ: మండలంలోని కమాల్‌పూర్, గోకారం, చారకొండ గ్రామాల సమీపంలో ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు బుధవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జె. వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వెంకట్ మాట్లాడుతూ సారా తయారీ పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చారకొండ మండల కేంద్రంలో గీతాకార్మిక లైసెన్స్ కలిగిన కొందరు గీతాకార్మికులు అక్రమంగా సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం ఉందని, వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ముస్తాబు



తాడూరులో ముస్తాబైన కస్తూర్బా పాఠశాల

కొల్లాపూర్/తాడూరు: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను ముస్తాబు చేశారు. కొల్లాపూర్ పట్టణంలో, మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను అందంగా అలంకరించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను బుధవారం శుభ్రం చేయించారు. తాగునీటి వసతులను పరిశీలించి, అవసరమైన వాటికి మరమ్మతులు చేయించారు. విద్యార్థులకు ఘనంగా ఆహ్వానం పలికేందుకు పూల తోరణాలు ఏర్పాటు చేశారు. కొల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ ఇమ్మానుయేల్ పరిశీలించారు. తాడూరు పాఠశాలలో తరగతి గదులకు రంగుల అద్దుతున్నారు. పరిసరాలు శుభ్రం చేయిస్తున్నారు. పనులను ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు.

యువశక్తి పథకాన్ని అమలు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని లక్ష్మణచారి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్ బండి లక్ష్మీపతిలు మాట్లాడుతూ జూన్ 2న రాజీవ్ యువశక్తి పథకాన్ని అమలు చేస్తామని చెప్పి మోసం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శివశంకర్, సురేష్, శ్రీను, పర్వతాలు పాల్గొన్నారు.

హోంశాఖ కేటాయించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మంత్రి శ్రీహరికి హోంశాఖ కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం బీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

విధుల్లోకి తీసుకోవాలి

కొల్లాపూర్ రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహాలలో 10 సంవత్సరాల నుంచి పని చేస్తున్న అసిస్టెంట్ కేర్ టేకర్లను ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్, స్వేరో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ గురుకులాల్లో కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టేందుకు అప్పటి ప్రభుత్వం కేర్ టేకర్లను నియమించిందన్నారు. ఆనాటి నుంచి గత విద్యా సంవత్సరం వరకు విధులు నిర్వహించారని గుర్తు చేశారు. కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అకారణంగా వారిని విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

సర్వేపనులు ప్రారంభం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి గ్రామ సమీపంలో కృష్ణనది ఒడ్డున టూరిజం శాఖ ఆధ్వర్యంలో అమరగిరి ఐ ల్యాండ్‌లో కాటేజీల నిర్మాణానికి బుధవారం జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ ఆధ్వర్యంలో టూరిజం, రెవెన్యూ శాఖల అధికారులు సర్వే పనులు చేపట్టారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డీఈ పరుషవేది, ఏఈ నాగార్జున గౌడ్, ఆర్‌ఐ జానయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

కందనూలు: జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలను బుధవారం విద్యార్థులకు ప్రిన్సిపాల్ మాధవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో కేసు నమోదయినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డకాలనీకి చెందిన వసంత బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లింది. ఎంత వెతికినా ఆచూకి లభించకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు కలెక్టర్ బదావత్ సంతోష్‌ను బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల్ల రాములు సత్కరించారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతిని చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రమోషన్లకు సంబంధించిన రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

వంట ఏజెన్సీలకు శిక్షణ



తెలకపల్లి/తిమ్మాజిపేట/లింగాల/ఉప్పునుంతల/కోడేరు: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు, వంట ఏజెన్సీ మహిళలకు మధ్యాహ్న భోజనం వండడంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. తెలకపల్లిలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాజిపేటలో ఎంఈఓ సత్యనారాయణ శెట్టి, లింగాల మండల విద్యాధికారి బషీర్ అహ్మద్, ఉప్పునుంతలలో ఎంఈఓ చంద్రశేఖర్, కోడేరు మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో వంట ఏజెన్సీలకు, ఉపాధ్యాయులకు ఎంఈఓ భాస్కర్‌శర్మ శిక్షణ ఇచ్చారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాలలో వంటగదుల్లో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. హెచ్‌ఎంలు, వంట నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

పనులు సత్వరమే పూర్తి చేయాలి

బిజినేపల్లి : మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని డీఈవో రమేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండలానికి చెందిన కేజీబీవీ పాఠశాలను డీఈవో సందర్శించారు. విద్యాలయానికి వేస్తున్న పెయింటింగ్ పనులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

చిన్నారులకు వ్యాక్సిన్లు

కొల్లాపూర్: పెంట్లవెల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం 6 నుంచి 14 వారాల లోపు పిల్లలకు రోటాసీల్ వ్యాక్సిన్లు వేశారు. కొల్లాపూర్–బీ సబ్‌సెంటర్, పెంట్లవెల్లి సబ్‌సెంటర్లలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్.విజయ్‌కుమార్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సంపూర్ణమ్మ, ఫార్మాసిస్టు జీకే వెంకటేష్, ఏఎన్‌ఎం సుమిత్ర, తిరుపతమ్మ తదితరులున్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

తిమ్మాజిపేట: మండలంలోని బుద్ధసముద్రంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు రాలేదని పలువురు గ్రామస్తులు బుధవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి అర్హులైన వారికి ఇవ్వాలని కోరారు. సుదర్శన్, దిలీప్, శేఖర్, అశోక్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పదాధికారుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడిగా అభిలాష్ గౌడ్, బోడపావని, మొగిలి పార్వతి, కొల్లూరు శ్రీధర్ ప్రధాన కార్యదర్శులుగా పర్వతాలు, నరెడ్ల శ్వేతా రెడ్డి, నీరు కంటి మంజుల గౌడ్, కిరణ్ కుమార్, వెంకటేష్ యాదవ్, కోశాధికారిగా లక్ష్మీ నరసింహ తో పాటు 34 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని ఎన్నికల ఇన్‌చార్జ్ కృష్ణ గౌడ్ తెలిపారు.

బీజేపీ పట్టణ కమిటీ ఏర్పాటు

కొల్లాపూర్: బీజేపీ పట్టణ కమిటీని బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు, రాష్ట్ర నాయకులు తమటం శేఖర్‌గౌడ్, సందు రమేష్ సమక్షంలో ఎన్నుకున్నారు. గతంలోనే పట్టణ అధ్యక్షుడిగా కాడం శ్రీనివాస్‌ను ఎన్నుకోగా, ఇప్పుడు ఉపాధ్యక్షులుగా దార్ల శ్రీనివాసరావు, పిన్నంశెట్టి శివ, లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బడా చందుయాదవ్, కార్యదర్శులుగా కవ్వళ్ల బాలపీరు, 45 మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



తాడూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కల్వకుర్తి మండలంలోని సుద్దకల్‌లో 53 దరఖాస్తులు వచ్చాయని జిల్లెల్ల గ్రామంలో 12 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఇబ్రహీం తెలిపారు. తాడూరు మండలంలో తహసీల్దార్ జయంతి హాజరయ్యారు. ఉప్పునుంత మండలంలోని తాడూరు, మొల్గర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని బుద్దసముద్రం, చేగుంట గ్రామాలలో సదస్సులు కొనసాగాయి. వెల్దండ మండలం కొట్రలో 5, చెదురుపల్లిలో 42లో దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ తెలిపారు.